క్లుప్తంగా

చర్చి అభివృద్ధి పేరిట అక్రమ వసూళ్లు

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలోని ది సెంటినరీ తెలుగు బాప్టిస్టు చర్చి (ఎస్‌బీ) అభివృద్ధి పేరిట సంబంధంలేని వారు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని చర్చి సెక్రటరీ ప్రసంగి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. చర్చి అభివృద్ధి పేరిట కొందరు వ్యక్తుల వద్దకు వెళ్లి చందాలు వసూలు చేస్తూ చర్చి వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడటం సరికాదని పేర్కొన్నారు. చర్చికి సంబంధంలేని వారు చెప్పే మాటలు నమ్మి విశ్వాసులు మోసపోవద్దని సూచించారు.

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు

గిద్దలూరు రూరల్: స్థానిక గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథపాలకురాలు ప్రసన్నకుమారి మాట్లాడుతూ.. విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. వారిలో దాగి ఉన్న సృజనాత్మకతను, నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు పోటీ పరీక్షలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ కమిటీ అధ్యక్షుడు రామిరెడ్డి, కార్యదర్శి ఫరూక్ తదితరులు పాల్గొన్నారు.

శాఖా గ్రంథాలయానికి వాటర్ డిస్పెన్సర్ అందజేత



వాటర్ డిస్పెన్సర్ అందజేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

మార్కాపురం: మార్కాపురం శాఖాగ్రంథాలయానికి లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పీవీ రామకృష్ణారావు ఆదివారం వాటర్ డిస్పెన్సర్ అందజేశారు. గ్రంథాలయానికి వచ్చే పాఠకులు తాగునీటికి ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంలో అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ శివారెడ్డి, లయన్స్ క్లబ్ ప్రతినిధులు రంగయ్య, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



యోగాసనాల పుస్తకాలు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

గిద్దలూరు రూరల్: యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని స్పందన సేవా సంస్థ ప్రధాన కార్యదర్శి పిక్కిలి పుల్లయ్య పేర్కొన్నారు. యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని రాచర్ల రోడ్డులో గల పిక్కిలి పుల్లయ్య కాంప్లెక్స్ వద్ద యోగా పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ యోగాసనాలు వేయడం వల్ల మానసిక ప్రశాంతతతో పాటుగా శారీరక దృఢత్వాన్ని పెంపొందించుకోవచ్చన్నారు. యోగాసనాలను ఏ విధంగా వేయాలి, ఉపయోగాల గురించి పుస్తకాల్లో వివరించినట్లు పేర్కొన్నారు. యోగాసనాలను నిత్య జీవనంలో అలవాటుగా మార్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు పాల్గొన్నారు.

జాడ లేని వరుణుడు



వర్షాలు లేక ఎండుముఖం పట్టిన నువ్వుల పంట



వ్యవసాయ బోర్లకు నీరందకపోవడంతో ఎండుతున్న పత్తి

- రాచర్ల మండలంలో ఎండుముఖం పట్టిన నువ్వులు, పత్తి పంట
- లోటు వర్షపాతం కారణంగా ఒట్టిపోతున్న డీప్‌బోర్లు

రాచర్ల: మండలంలో వర్షపాతం తీరు రైతులను కలవరానికి గురిచేస్తోంది. ప్రస్తుత ఖరీఫ్‌కు సీజన్‌కు సంబంధించి ఇప్పటి వరకు సమృద్ధిగా వర్షాలు కురవకపోవడంతో పంటలు క్రమంగా ఎండుముఖం పడుతున్నాయి. గత నెలలో అడపాదడపా కురిసిన వర్షాలకు రైతులు నువ్వులు, ఆముదం, పత్తి పంటలు సాగు చేశారు.

రాచర్ల మండలంలో 1,557 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేశారు. పత్తి 1090, ఆముదం 90, నువ్వులు 216, చిక్కుడు 112, కంది 20, పచ్చిమిర్చి 8, టమోట ఒక ఎకరా, బొప్పాయి 10, అరటి 10 ఎకరాల్లో రైతులు సాగు చేసినట్లు వ్యవసాయాధికారుల గణాంకాలు వెల్లడిస్తున్నాయి. జేపీ చెరువు, ఆరవీటికోట, ఆకవీడు, చోళ్లవీడు, రాచర్ల, సోమిదేవిపల్లె, అనుమలవీడు, గంగంపల్లె గ్రామాల్లో వ్యవసాయ బోర్ల కింద అత్యధికంగా పత్తి పంట సాగు చేశారు.

ఒట్టిపోతున్న డీప్‌బోర్లు

భూగర్భ జలాలు తగ్గుముఖం పట్టడంతో వ్యవసాయ బోర్ల కింద సాగు చేసిన పత్తి, ఆముదం, చిక్కుడు పంటలు సైతం సక్రమంగా నీరందక ఎండిపోతున్నాయి. ఆముదం, పత్తి, చిక్కుడు పంట పొలాలకు నీటి తడులు అందించిన మరుసటి రోజే ఎండ, పడమటి గాలుల దెబ్బకు నేల పొడిబారుతోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అనుమలవీడు, గంగంపల్లె, జేపీ చెరవు, చోళ్లవీడు గ్రామాల్లో వ్యవసాయ బోర్లకు నీరందకపోవడంతో పత్తి సాగు చేసిన రైతులు తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు. ఈ నెలలోనూ సమృద్ధిగా వర్షాల్లేకపోవడంతో రాచర్ల మండలంలో మైనస్‌లలో వర్షపాతం నమోదైంది. ప్రస్తుతం వాతావరణంలో భిన్నమైన పరిస్థితులు నెలకొనడంతో పత్తి, మిరప, ఆముదం, బొప్పాయి, చిక్కుడు సాగుపై నీలి నీడలు కమ్ముకునేలా చేస్తోంది. ఈ వారంలో వర్షాలు కురిస్తేనే పంటలను కాపాడుకునే అవకాశముంటుదని రైతులు అభిప్రాయపడుతున్నారు.

ఎండ, వడగాలితో నీరు ఆవిరి



నేను వ్యవసాయ బోరు కింద రెండు ఎకరాల్లో పత్తి పంట సాగు చేశా. పత్తి నాటి నెలవుతున్నప్పటికీ వర్షాలు కురవలేదు. బోర్లకు కూడా సక్రమంగా నీరందడం లేదు. అరకొరగా వచ్చే నీటిని పత్తి పంటకు పెట్టినా ఆ మరుసటిరోజే ఎండ, పడమటి గాలులకు పొలంలోని తేమ అంతా ఆవిరైపోతోంది. వానలు కురిస్తేనే పంటలు బతుకుతాయి.

– రోషిరెడ్డి, రైతు, గంగంపల్లె

వైఎస్సార్ సీపీ నాయకురాలికి 'అన్నా' పరామర్శ



నూర్జహాన్ బేగంతో మాట్లాడుతున్న అన్నా రాంబాబు

పొదిలి రూరల్: వైఎస్సార్ సీపీ నాయకురాలు, పొదిలి పట్టణ కన్వీనర్ షేక్ నూర్జహాన్ బేగం ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ శస్త్రచికిత్స అనంతరం కనిగిరిలోని స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఆమెను వైఎస్సార్ సీపీ మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు ఆదివారం కనిగిరి వెళ్లి పరామర్శించారు. ఆమె యోగక్షేమాలు తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని అకాంక్షించారు. ఆయన వెంట గొలమారి చెన్నారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

పురుషోత్తమునిపల్లెలో తాగునీటికి కటకట



మరమ్మతులకు గురైన డీప్‌బోరు



నిరుపయోగంగా మంచినీటి ట్యాంక్

కొమరోలు: మండలంలోని పురుషోత్తమునిపల్లె గ్రామస్తులు గత నెల రోజులుగా మంచినీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నెల రోజుల క్రితం గ్రామంలోని రెండు డీప్‌బోర్లు మరమ్మతులకు గురయ్యాయి. కొమరోలు గ్రామ పంచాయతీ పరిధిలో ఉండే పురుషోత్తమునిపల్లె వాసులు నీటి సమస్య గురించి గ్రామ కార్యదర్శికి విన్నవించినా స్పందన లేదు. ఓ మోటారుకు స్టార్టర్ సమస్య తలెత్తడంతో 10 నిమిషాలపాటు కూడా నీరు రావడం లేదని వాపోతున్నారు. నీటి కోసం పొలాల్లోని వ్యవసాయ బోర్ల వద్దకు వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని రెండు మంచినీటి ట్యాంకర్లు కూడా వినియోగంలో లేకపోవడంతో నీటి సమస్య మరింత జఠిలమైందని, ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

కొలిక్కి రాని ట్రాఫిక్ సమస్య



దుకాణాల ముందు పార్కింగ్ చేసిన ద్విచక్రవాహనాలు, నిలిచిన ట్రాఫిక్



లారీ పక్క నుంచి వెళ్లేందుకు దారి కోసం తొంగి చూస్తున్న ద్విచక్ర వాహనదారుడు

- కంభంలో వాహనదారులు, ప్రజలకు తప్పని తిప్పలు



సర్కిల్ కార్యాలయం సమీపంలో మలుపు తిరగలేకపోతున్న లారీ

కంభం: మండల కేంద్రమైన కంభం పట్టణంలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకూ జఠిలమవుతోంది. సమస్యను పరిష్కరిస్తామంటూ ఇటీవల పోలీసులు చేసిన ప్రకటన కేవలం మాటలకే పరిమితమైంది. ఆక్రమణలతో రహదారులు కుంచించుకుపోవడం, కొందరు వ్యాపారులు తమ షాపుల్లోని వస్తువులను రోడ్ మార్జిన్‌లో ప్రదర్శనకు ఉంచుతుండటంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోందని ఇప్పటికే అధికారులు గుర్తించారు. కానీ సమస్య పరిష్కారంపై దృష్టి సారించకుండా వదిలేశారు.

కంభం చౌక్ సెంటర్‌లో ట్రాఫిక్ సమస్యకు ఏళ్ల తరబడి పరిష్కారం లభించడం లేదు. కందులాపురం కూడలి నుంచి ప్రారంభమయ్యే మెయిన్‌రోడ్డు అక్కడ 30–40 అడుగుల వెడల్పు ఉండగా క్రమంగా తగ్గిపోతూ చౌక్ సెంటర్‌కు వచ్చే సరికి 10–15 అడుగులకు పరిమితం కావడంతో వాహనాలు తిరిగేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. చౌక్ సెంటర్‌లో హోల్ సెల్‌దుకాణాలు, రేషన్ షాపులు ఉండటంతో ఉదయం పూట ఈ ప్రాంతంలోకి సరుకుల లోడు లారీలు వస్తుంటాయి. ఆ సమయంలో సైకిల్‌పై వెళ్లేవారు కూడా లారీని దాటుకొని వెళ్లాలంటే కష్టంగా ఉంది. ఇదే మార్గంలో రోజూ ఉదయం, సాయంత్రం సుమారు 25 వరకు స్కూల్ బస్సులు తిరుగుతుంటాయి. ఆ సమయంలో వాహనదారులు స్కూల్ బస్సులను అనుసరించక తప్పడం లేదు. మూడేళ్ల క్రితం పట్టణంలోని చౌక్ సెంటర్‌లో నూతనంగా సర్కిల్ కార్యాలయం ఏర్పాటు చేశారు. సర్కిల్ కార్యాలయం ఏర్పడి నిత్యం ఆ మార్గంలో పోలీసు అధికారులు తిరుగుతున్నప్పటికీ ట్రాఫిక్ సమస్యకు మాత్రం పరిష్కారం లభించడం లేదు. అడపాదడపా వాహనదారులకు జరిమానా విధించే పోలీసులు ట్రాఫిక్ సమస్యను మాత్రం పట్టించుకోవడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. ట్రాఫిక్ సమస్యను పరిష్కరిస్తామని పోలీసు అధికారులు తరచూ చెబుతున్నప్పటికీ అది ఆచరణకు నోచుకోవడం లేదు. చౌక్ సెంటర్‌తో పాటు బస్టాండ్, కందులాపురం కూడలిలో ఆక్రమణదారులు ముందుకు రావడంతో ప్రజలు, వాహనదారులు ట్రాఫిక్ సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి ట్రాఫిక్ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అల్లూరి పోలేరమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకారంలో అల్లూరి పొలేరమ్మతల్లి



ప్రత్యేక అలంకరణలో కోట సత్యమాంబదేవి

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణ శివారులో కొలువై ఉన్న అల్లూరి పోలేరమ్మకు ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని అర్చకులు ప్రత్యేకంగా అలంకరించారు. పట్టణంతోపాటు పరిసర ప్రాంత గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారికి పొంగళ్లు పెట్టి నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న నాగ శిలలు, పుట్ట వద్ద పూజలు చేశారు.

పోలేరమ్మ తల్లికి పూజలు

అర్ధవీడు: మండలంలోని అంకభూపాలెం సమీపంలో కొలువై ఉన్న పోలేరమ్మ తల్లికి పాపినేనిపల్లె, అంకభూపాలేనికి చెందిన భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారులు అమ్మవారి మూలవిగ్రహమూర్తిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, కుంకుమ పూజలు చేశారు. మహిళలు ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు పెట్టి అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించారు. అర్ధవీడు పట్టణ పరిసర గ్రామాల ప్రజలు కూడా అమ్మవారిని దర్శించుకున్నారు.

కోట సత్యమాంబదేవికి ప్రత్యేక పూజలు

బేస్తవారిపేట: మండలంలోని గొట్టమిండ్ల సమీపంలో కోటసత్యమాంబదేవి, బేస్తవారిపేట, పాపాయిపల్లెలో పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోట సత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారిని, సత్యమణికంఠేశ్వరుడిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, కుంకుమ పూజలు చేశారు. భక్తులు అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు.

ముగిసిన అంకమ్మతల్లి కొలుపులు



అమ్మవారిని దర్శించుకుంటున్న అన్నా, నాయకులు

- అమ్మవారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే అన్నా, నాయకులు



ప్రత్యేక అలంకరణలో అంకమ్మతల్లి

కొనకనమిట్ల: మండలంలోని సిద్ధవరం గ్రామంలో గత ఐదు రోజులుగా వైభవంగా నిర్వహించిన అంకమ్మతల్లి కొలుపుల ఉత్సవం ఆదివారంతో ముగిశాయి. రజక సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 18వ తేదీన కొలుపులు ప్రారంభం కాగా చివరి రోజు ఆదివారం భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమ, గాజులు సమర్పించి మొక్కులు చెల్లించారు. కొలుపుల సందర్భంగా అంకమ్మతల్లికి రోజుకో ఉత్సవం నిర్వహించారు. కమిటీ నిర్వాహకులు, మాజీ సర్పంచ్ యలమందల శ్రీను ఆధ్వర్యంలో అన్న సంతర్పణ చేశారు.

అమ్మవారిని దర్శించుకున్న 'అన్నా'

అంకమ్మతల్లి అమ్మవారిని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు, నియోజకవర్గ ఇన్‌చార్జి అన్నా రాంబాబు, మండల పార్టీ నాయకులు దర్శించుకుని పూజలు నిర్వహించారు. గ్రామ దేవతల ఆశీస్సులతో ప్రజలంతా సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణయాదవ్, వైస్ ఎంపీపీ మెట్టు వెంకటరెడ్డి, స్థానిక సర్పంచ్ ఇమ్మానియేల్, ఎంపీటీసీ మీరావలి, మాజీ ఎంపీపీ ఉడుముల రామనారాయణరెడ్డి, పలు గ్రామాల సర్పంచ్‌లు పాతకోట వెంకటరెడ్డి, పార్లపల్లి సిద్దానభి, ప్రకాష్‌రెడ్డి, నాయకులు జి.చెన్నారెడ్డి, పి.చెంచిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పగలే వెన్నెల!



గొట్లగట్టులో పగలే వెలుగుతున్న వీధిలైట్లు



సిద్ధవరం ఎస్సీ కాలనీలో ఇలా..

కొనకనమిట్ల: మండలంలోని పలు గ్రామాల్లో పట్టపగలే వీధిలైట్లు వెలుగుతున్నాయి. మరి కొన్ని గ్రామాలలో రాత్రి పూట కూడా వీధి లైట్లు వెలగక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గొట్లగట్టు, సిద్ధవరం ఎస్సీ కాలనీ, పేరారెడ్డిపల్లి, కాట్రగుంట, వెంగలపల్లి తదిర గ్రామాల్లో పగటి పూట వీధి లైట్లు వెలుగుతున్నా విద్యుత్ శాఖ సిబ్బంది పట్టించుకోవడం లేదు.

పలు చోట్ల అంధకారం

రాత్రిపూట వీధిలైట్లు లేక, పలు చోట్ల వెలగక ప్రజలు అంధకారంలో మగ్గుతున్నారు. నాయుడుపేటలో, ఎదురాళ్లపాడు ఎస్సీ కాలనీలో కొన్ని లైట్లు ఉన్న వెలగడం లేదు. కొన్ని చోట్ల స్తంబాలకు లైట్లే వేయకపోవడంతో రాత్రి పూట చీకట్లో భయభయంగా వెళ్లాల్సి వస్తోందని ఆయా గ్రామాల ప్రజలు అందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వీధిలైట్లు ఏర్పాటు చేయడంతోపాటు పగటి పూట కాకుండా రాత్రి వేళ లైట్లు వెలిగేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అభయాంజనేయస్వామికి నెల పొంగళ్లు



పూజలందుకుంటున్న అభయాంజనేయస్వామి మూలవిరాట్

కురిచేడు: మండలంలోని కాటంవారిపల్లె గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ అభయాంజనేయస్వామికి ఆదివారం నెల పొంగళ్లు సమర్పించారు. వార్షికోత్సవం జరిగి నెలరోజులు కావడంతో నెలపొంగళ్లు చేయడం ఆనవాయితీ. గ్రామంలోని మహిళలందరూ ఉదయాన్నే ఆలయం వద్దకు శుచిగా వచ్చి పొంగళ్లు తయారు చేసి స్వామివారికి నివేదించారు. అనంతరం తీర్థప్రసాదాలు వితరణ చేశారు.

9 మంది జూదరులు అరెస్టు



పోలీసుల అదుపులో ఉన్న జూదరులు

కొనకనమిట్ల: కోడి పందేల శిబిరంపై పోలీసులు దాడి చేసి 9 మంది జూదరులను అదుపులోకి తీసుకున్నారు. ఈ సంఘటన మండలంలోని వాగుమడుగు సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై ప్రభాకరరెడ్డి కథనం మేరకు.. కోడి పందేలు నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో ఎస్సై తమ సిబ్బందితో కలిసి మెరుపుదాడి చేశారు. జూదరులను అదుపులోకి తీసుకుని, కోళ్లతోపాటు కత్తులను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరుపరచనున్నట్లు ఎస్సై తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలపై పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు.